అడల్ట్సోన్లీకథ

# నువ్వేకావాలి

ఆకునూరి మురళీకృష్ణ

నిమిషాలనీ సెకన్లనీ లెక్కపెట్టుకుంటూ నిల్చుంది ఉమ. అయిదడుగుల అయిదంగుళాల పొడవు, పాలలో కుంకుమ పువ్వు కలిపినట్టున్న వర్ణం... విశాలమైన నేత్రాలు... సూటిగా తీర్చిదిద్దినట్లున్న ముక్కు, ఎంతో కష్టపడి చిత్రకారుడు గీసిన స్ట్రోక్స్‌లాంటి పెదాలు, బుగ్గలు...మెడ.

ఆమెని గబుక్కున చూసిన వాళ్ళెవరి దృష్టైనా మొదట ముందుకు పొడుచుకు వచ్చినట్లు బింకంగా వున్న ఆమె యెదపొంగులమీదే పడుతుంది. ఆ తర్వాత సన్నని నాజూకు నడుము మీద అల్లల్లాడి అక్కడ నిలబడడానికి స్థలం లేక కిందికి జారి ఘనమైన ఆమె ఝఘనం మీదకి చేరి ఆ అద్భుతమైన సౌష్ఠవానికి మతిపోయి కిందపడి మరి పైకిలేచే ధైర్యం లేక చూపులు ఆమె పాదాల దగ్గర ఆగిపోతాయి పాదాక్రాంతమైనట్లుగా.

శోభనం మంచంమీద కూర్చున్న అభిరామ్ మాత్రం అల్లరిగా ఆమె కళ్ళలోకే చూస్తున్నాడు.

ఉమకి అతని చూపులు ఇబ్బందిగా వున్నాయి. అతనలా సూటిగా తన కళ్ళలోకే చూడడం భరించలేకపోతోంది. చూపులైనా తిప్పుకోడేం? తలతిప్పి అతని వంక చూసింది. అతని పెదాలు విచ్చుకుంటున్నాయి... హమ్మయ్యా! అడిగేస్తాడు..అడిగేస్తాడు. తను మొత్తం చెప్పెయ్యవచ్చు. తన గుండెలమీదున్న బరువుని దించేసుకోవచ్చు. రిలీఫ్‌గా ఫీలై అతడివంక ఆతృతగా చూసింది అతనేం మాట్లాడతాడా అని.

''స్వాగతం..నా జీవనయానంలోకి నాకు తోడుగా అడుగు పెట్టబోతున్న నా ప్రియసహచరీ.. స్వాగతం!'' అన్నాడతను మంచం మీద మోచేతిమీద ఆనుకుని పడుకుని ఆమె వంకే చిలిపిగా చూస్తూ ఆహ్వానిస్తున్నట్లుగా.

ఆమె ఆశ్చర్యపోతూ చూసిందతని వంక. రాత్రి భోజనాల సమయంలో తను చేసిన అవమానానికి కోపం తెచ్చుకుని తనని సంజాయిషీ అడుగుతాడనుకుని ఎదురుచూస్తుంటే అతడసలు ఆ విషయాన్ని గుర్తించినట్లుగానే కనబడటం లేదే?

అతను సంజాయిషీ అడుగుతాడేమో..దాన్ని అవకాశంగా తీసుకుని గొడవపెట్టుకుని తను చెప్పాలనుకుంటున్నదంతా చెప్పేద్దామనుకుంది. కానీ అతడా విషయాలనేం ఎత్తేటట్లు కనబడటం లేదు.


''కూర్చో..'' అన్నాడతను.

అతని కంఠంలో ఏ మంత్ర శక్తి వున్నదోకానీ అనాలోచితంగా మంచం మీద అతనికభిముఖంగా కూర్చుని గోరింటాకుతో పండిన చేతి వేళ్ళని చూసుకుంటూ ఆలోచించసాగిందామె. తను చెప్పదలుచుకున్న విషయం అతనికెలా చెప్పాలి?

ఇప్పుడు...ఈ సమయంలో చెప్పడం సంస్కారమనిపించుకోదని తెలుసు. కానీ చెప్పక తప్పదు. బెటర్ లేట్ దేన్ నెవర్..మనసులో ఇదీ అని చెప్పలేని ఇబ్బంది..లాంటి పరిస్థితి ఏ ఆడపిల్లకీ రాకూడదనుకుంది.

భోజనాల దగ్గర అతని మిత్రబృందం. ఇతర బంధువర్గం అంతా కలిసి వధూవరులిద్దరినీ ఒకరికొకరు ఎంగిలి తినిపించుకోమని పట్టుపట్టారు. తను ఎంగిలి చేసిన పదార్థాలని అతను ఆనందంగా తిన్నాడు. అతన్ని కూడా ఆమెకి పెట్టమని బలవంతం చేసారు.

చివరికి వాళ్ళ బలవంతానికి తలొగ్గి తను చిన్నగా కొరికిన లడ్డూని ఆమెకి తినిపించబోయాడు అభిరామ్.



ముఖం చిట్లించి తల తిప్పేసుకుంది ఉమ.

అందరూ విస్తుపోయారు ఆమె చర్యకి. అతని తరఫు బంధువులకైతే కొంచెం కోపం కూడా వచ్చి ముఖాలు మాడ్చుకున్నారు.

అభిరామ్ మాత్రం నవ్వుతూ 'తనకి సిగ్గు ఎక్కువ. అందరిలోనూ అలాంటి పనులు చేయనంటోంది' అంటూ సర్ది చెప్పాడు.

అప్పటికి అందరి ముందూ అలా తనని సమర్ధించినా అతనికి మనసులో తను చేసిన పని పట్ల కోపం వచ్చే వుంటుందని ఆమె అనుకుంది. ఆ కోపాన్ని తామిద్దరూ ఏకాంతంగా వున్న ఈ సమయంలో ప్రదర్శిస్తాడనుకుంది. దాన్ని ఆసరాగా చేసుకుని అతనికి తను చెప్పాలనుకున్న విషయం చెప్పేద్దామనుకుంది.

''ఉమా..ఈ చీరలో నువ్వెంత అందంగా వున్నావో తెలుసా? అచ్చం దివి నుంచి భువికి దిగి వచ్చిన దేవకన్యలా వున్నావు'' ఆమెని ఆపాదమస్తకం పరికించి చూస్తూ అన్నాడు అభిరామ్.

అతని చూపులు ముందుకి వంగి కూర్చున్న ఆమె వేసుకున్న లోనెక్ జాకెట్లోంచి ఉబికి వస్తూ కనిపిస్తున్న తన యెద పొంగుమీద వున్నాయని తెలిసి ఆమె కంగారు పడింది. సర్దుకుందామని ప్రయత్నిస్తే, పైట చెంగు కొంచెం స్థానభ్రంశం చెంది పల్చని జాకెట్లోంచి గుండ్రని ఆకారం మరింత స్పష్టంగా కనిపించేసరికి అతను నవ్వాపుకోలేకపోయాడు.

ఉమ పైట చెంగు సవరించుకుని నిటారుగా కూర్చోవాలని ప్రయత్నించింది. ఈసారి చీరకీ జాకెట్‌కీ మధ్య నగ్నంగా కనిపిస్తున్న ఆమె పలుచని ఉదరం మీద పడ్డాయి అతని చూపులు..ఉమకేం చేయాలో అర్ధంకాక అయోమయంగా చూసిందతని వైపు.

''ఎందుకంతలా భయపడతావు? చూడడానికలా కనిపించినా నేనేం రాక్షసుడ్ని కాను!'' అన్నాడతను నవ్వుతూనే.

ఉమ నొచ్చుకుంటున్నట్లుగా చూసిందతని వైపు. అతను పెద్దగా అందంగా వుండకపోవచ్చు. నల్లగా, చూడగానే సినిమాల్లో విలన్ గుర్తుకువచ్చేలా వుండొచ్చు. కానీ అందుకు అతన్ని అవమానించడం తన ఉద్దేశం కాదు.

ఆమెకి రఘు గుర్తొచ్చాడు..అందంగా చక్కని హెయిర్ స్టైల్‌తో లైట్‌గా పెంచిన గెడ్డం..నాజూకైన శరీరం..చురుకైన మూమెంట్స్..ఇవి చూసే కదూ తను అతనంటే పిచ్చి అభిమానాన్ని పెంచుకుని ప్రేమించింది? అతని అశక్తత అయితేనేమి? తనవాళ్ళ బలవంతం వల్ల అయితేనేమి? ఆ రఘురామ్ ఉండాల్సిన స్థానంలో ఈ అభిరామ్.

తనకింక భరించే శక్తిలేదు. ఇంకా అతన్ని మోసం చేస్తూ తనని తాను మోసం చేసుకోలేదు. చెప్పెయ్యాలి..అతని మంచితనానికి తను పూర్తిగా కరిగిపోకముందే అతనికి అంతా చెప్పేసి తన మనసుని ప్రక్షాళన చేసుకోవాలి.

అతనికి తనతో గొడవ పెట్టుకునే ఉద్దేశ్యం ఏమాత్రం లేనట్లుగా కనిపిస్తుండడంతో చివరికి ఆమే అంది.

''భోజనాల దగ్గర నేను అలా ప్రవర్తించడం తప్పే...''

## త్రిషకి నచ్చిన సినిమా

**మాయాబజార్ సినిమాని వంద సార్లు చూశాను, అడవిరాముడు సినిమాని యాభైసార్లు చూసాను అంటూ తమకి నచ్చిన సినిమాల గురించి ఒక్కొక్కళ్లూ ఒక్కోలా చెప్తారు. సినిమా తారలకి కూడా నచ్చిన సినిమాలు ఎందుకుండవు? త్రిషకి బాగా నచ్చిన సినిమా ఒకటి వుందిట. అది కూడా ఓ హాలీవుడ్ సినిమా. 'ఇంగ్లీష్ పేషెంట్' అనే ఈ సినిమాని ఆమె ఇప్పటికి అక్షరాలా వందసార్లు చూసిందిట. ముందు ముందు వీలైతే మరో రెండొందల సార్లయినా చూడాలని తెగ సంబరపడిపోతోందిట త్రిష. ఆమెకి అంత బాగా నచ్చిన ఆ సినిమాలో ఏం ప్రత్యేకత వుందో?**



అతడు చిన్నగా నవ్వాడు. ''నువ్వింకా ఆ విషయమే ఆలోచిస్తున్నావా? నేనెప్పుడైతే అగ్నిసాక్షిగా నీ మెళ్ళో మూడు ముళ్ళు వేసానో అప్పటి నుంచీ నువ్వు వేరు నేను వేరు కాదు. ఇద్దరం ఒకటే. నేను తప్పు చేస్తే ఎంతో నువ్వు తప్పు చేసినా అంతే. నిన్ను అవమానిస్తే నన్ను నేను అవమానించుకున్నట్లే!''

అతని మాటలకి విచలితురాలై చూసింది ఉమ. అతని మీద తనకున్న అయిష్టాన్ని తెలియచెప్పాలని అప్పుడు తను కావాలనే అలా ప్రవర్తించింది. అతన్ని అవమానించాలని తను చేసిన ప్రయత్నం నలుగురిలోనూ తామిద్దరినీ నవ్వులపాలు చేసిందని చెప్పకనే ఎంత చక్కగా చెప్పాడు?

''అయాం సారీ'' అప్రయత్నంగా అంది.

''మనం ఇప్పుడు ఒకరికొకరు చెప్పుకోవలసింది సారీలు కాదు'' అంటూ అల్లరిగా చూస్తూ ఆమెకి దగ్గరిగా వచ్చాడతను. అతనంత దగ్గరగా వచ్చేసరికి ఆమె గుండెలు వేగంగా కొట్టుకోసాగాయి. తను చెప్పాలనుకుంటున్న మాటలు గొంతులోనే ఆగిపోయి గుండె గొంతులో కొట్టుకుంటున్నట్లనిపించింది.

అతని చేతులు సుతిమెత్తగా ఆమె భుజాల చుట్టూ అల్లుకున్నాయి. మెడవంపు దగ్గర ఆమె శ్వాస వెచ్చగా తగులుతూ అతనికి వింత అనుభూతినిస్తోంది. ఆమె నుంచి వస్తున్న ఒక ప్రత్యేకమైన పరిమళమేదో అతన్ని చుట్టేసి వివశుడ్ని చేస్తోంటే అతని చేతులలాగే సున్నితంగా కిందికి జారాయి. జాకెట్ అంచులు దాటి కిందికి దిగగానే నగ్నంగా తగిలిన ఆమె నాజూకు నడుము స్పర్శకి మైమరచిపోతూ మరింత కిందికి దిగి జఘనభాగం మీద ఆగిపోయాయి. అతని గుండె కొట్టుకునే వేగం పెరిగింది. ఆమె యెద పొంగులు అతని ఛాతికి తగిలీ తగలనట్లుగా తగులుతూ గిలిగింతలు పెడుతున్నాయి. వంట్లోని రక్తమంతా ఆమె స్పర్శ తగులుతున్న చోటికే ఆత్రంగా పరుగులు పెడుతున్నట్లు నరాల్లో ఏదో వింత అలజడి.

ఊహించని అతని చర్యకి ఆమె మెదడంతా శూన్యమైపోయినట్టుగా వుంది.

అతను రెచ్చిపోతూ ఆమెనలాగే తన కేసి మరింత బలంగా హత్తుకోబోతుంటే తన మనసు వశం తప్పుతున్నట్లుగా అనిపించింది ఉమకి. గబుక్కున దూరం జరిగింది.

అతను ఆమెని సమీపించి మెల్లగా చుబుకాన్ని పట్టుకుని పైకెత్తాడు. నీటిలో కదిలే

చేప పిల్లల్లా కనబడ్డాయామె పెద్ద పెద్ద కళ్ళు అత నికా క్షణంలో. క్రింది పెదవిని పైపంటితో బలంగా కొరుకుతూన్న ఆమెని చూస్తే అప్రయత్నంగానే నవ్వొచ్చిందతనికి. ఆయాసంతో ఆమె గుండెలు ఎగసెగసి పడుతున్నాయి.

''ఎందుకంత కంగారు పడతావు?'' అంటూ ఆమెని మళ్ళీ దగ్గరికి తీసుకోబోయాడతను.

''ప్లీజ్...'' అంటూ అతనికి దూరంగా జరిగిందామె.

ఆమెకి ఏదో పెద్ద తప్పు చేసినట్లు చాలా గిల్టీగా అనిపించసాగింది. లాభం లేదు. అతనికెలాగైనా చెప్పెయ్యాలి. ఈ సంఘర్షణని తను భరించలేదు. మొత్తం చెప్పేసి అతనికి దూరంగా వెళ్ళిపోవాలి. కానీ ఎలా? చూస్తూ అంత మంచి మనిషి నిండు జీవితాన్ని నాశనం చేయడం ఎలా?

ఆలోచనతో ఆమె తల బద్దలైపోతున్నట్లుగా వుంది. అతనికేదో చెప్పాలని నోరు విప్పబోయింది. పెదాలు తడారిపోయాయి. భయంతో వెన్నులో ఒణుకు మొదలైంది. కాసేపటికి ఆ ఒణుకు నెమ్మదిగా శరీరమంతా వ్యాపించి చలి జ్వరం వచ్చినవానిలా ఒణకసాగింది.

''అరెరే'' అంటూ గబగబా ఆమెని మంచం మీద పడుకోబెట్టి దుప్పటి కప్పాడతను. ఫేన్ తగ్గించి వచ్చి ఆమె పక్కనే కూర్చుని నెమ్మదిగా ఆమె ముంగురులని సవరించసాగాడు. ఈసారి అతని స్పర్శలో ఎటువంటి ఆవేశమూ లేదు. తన తండ్రి పక్కన కూర్చుని సపర్యలు చేస్తున్నట్లుగా అనిపించి కళ్ళు మూసుకుందామె.

ఆమె కళ్ళు తెరిచి చూసేసరికి అతను మంచం పక్కనే కింద బ్లాంకెట్ వేసుకుని పడుకుని కనిపించాడు.

★ ★ ★

''రఘూ..నా మాట విను..నిన్ను ప్రేమించి అతనితో జీవితాన్ని పంచుకోవడం..నేనా నరకాన్ని భరించలేను. ఏమైనా జరగనీయ్..అన్నీ వదిలిపెట్టి నీతో ఈ క్షణంలో వచ్చెయ్యడానికి సిద్ధంగా వున్నాను. అందరికీ దూరంగా మనమిద్దరం ఎటైనా వెళ్ళిపోయి ప్రశాంతంగా బతుకుదాం. అందుకే ఇంట్లో అంతమంది బంధువులున్నా లెక్కచేయకుండా వచ్చాను'' కన్నీళ్ళతో అంటున్న ఉమ వంక ఆశ్చర్యంగా చూసాడు రఘు.

మరుక్షణం ఏదో జోక్ విన్నట్లు పెద్దగా నవ్వాడు. ''ఏమిటి ఉమా నువ్వంటున్నది? పెళ్ళి చేసుకుని, ఆ తుమ్మమొద్దుతో ఒకరోజు శోభనం కూడా చేసుకుని ఇప్పుడు తీరిగ్గా వచ్చి నాతో వచ్చేస్తానంటున్నావా?'' అన్నాడు నవ్వుతూనే.

ఆ మాటలు శరాఘాతంలా తగిలాయి ఆమెకి. అతని గొంతులో ధ్వనించిన హేళన గుండెల్ని కోసేస్తున్నట్లుగా అనిపించింది.

''రఘూ...నిజం..నువ్వనుకున్నదేమీ జరగలేదు. నిన్న రాత్రి మా మధ్యన'' భూమిలోకి కుంచించుకుపోతున్నట్లుగా ఫీలవుతూ మెల్లిగా గొంతు పెగుల్చుకుంటూ అంది. అతనికిలాంటి సంజాయితీ ఇచ్చుకోవలసి వస్తుందని ఆమె కలలో కూడా ఊహించలేదు.

''అలా అని నన్ను నమ్మంటావు?'' వ్యంగ్యంగా అన్నాడు.

ఉమ దెబ్బతిన్నట్లుగా చూసిందతని వంక.

''నా గురించి నీకు తెలియదా రఘూ...ఇన్నాళ్ళ మన పరిచయంలో నిన్ను నా వంటిమీదెప్పుడైనా చెయ్యి వేయనిచ్చానా? ఇంతగా ప్రేమించిన నిన్నే దూరంగా వుంచానంటే ఏమాత్రం పరిచయం లేని అతనితో కేవలం ఒక్క రాత్రిలో..అసలు నువ్వెలా ఊహించావ్ రఘూ'' అతన్ని నమ్మించాలని ప్రయత్నిస్తూ బాధగా అంది.

అతడు మళ్ళీ నవ్వాడు. ''నిజమే ఉమా...నన్ను నీ వంటి మీదెపుడూ చెయ్యి కూడా వేయనీయలేదు. కానీ అతడు నీ బోయ్‌ఫ్రెండ్ కాదు. మొగుడు. నువ్వు వద్దంటే ఊరుకుంటాడనుకోను. బోయ్‌ఫ్రెండ్‌కీ మొగుడికీ తేడా వుంది''

అతను మాట్లాడుతుంటే ఆమెకి గుండెలు రగిలిపోసాగాయి. అంతకు ముందు తనకి తెలిసిన రఘుకీ, ఈ రఘుకీ ఎంత తేడా? దీనినేనా ప్రేమనుకుంది తను? అతనితోనా జీవితాన్ని పంచుకోవాలని అన్నీ వదిలేసుకుని వచ్చేద్దామనుకుంది? ఆమెకాక్షణంలో ఎందుకో అభిరామ్ గుర్తుకు వచ్చేడు.

ఇన్నాళ్ళ పరిచయం వుండీ, తనని ప్రేమించిన ఇతడే ఒక్కరోజు కోసం తన శీలాన్ని శంకిస్తున్నాడు. మరి..ఏమాత్రం పరిచయం లేని అభిరామ్..పెళ్ళికి ముందు తన జీవితాన్ని గురించి ఏమాత్రం తెలియని అభిరామ్ తన శీలాన్ని గురించి ఒక్క మాట కూడా ప్రశ్నించకుండా అంత సాదరంగా తనని జీవితంలోకెలా ఆహ్వానించగలిగాడు?

'నిజమే రఘూ..బోయ్‌ఫ్రెండ్‌కీ మొగుడికీ చాలా తేడా వుంది. నేనే గుర్తించలేకపోయాను' కన్నీళ్ళతో వెనుదిరుగుతూ అనుకుంది.

★ ★ ★

అక్కడి నుంచి దాదాపు పరుగెడుతున్నట్లుగా ఇంటికి చేరుకుంది ఉమ. కన్నీళ్ళు ఆపుకుందామన్నా ఆగడం లేదు. గబగబా పరిగెడుతూ ఎవరైనా చూస్తున్నారేమోనన్న ధ్యాస కూడా లేకుండా అభిరామ్ వున్న గదిలోకి వెళ్ళి తలుపేసుకుంది. పరుగు పరుగున వెళ్ళి అతడ్ని వాటేసుకుని వెక్కివెక్కి ఏడవసాగింది చిన్నపిల్లలా.

ఏం జరిగిందని అతడు అడగలేదు. నెమ్మదిగా ఆమె వెన్ను నిమురుతూ ఓదార్చాడు. వెక్కిళ్ళ మధ్య అతనికి తను చెప్పదలుచుకున్నది సగం చెప్పింది. మిగతా సగం అతను అర్థం చేసుకున్నాడు. ఏడ్చి ఏడ్చి కన్నీళ్ళతో తడిసి పునీతమైనట్లుగా సేదతీరింది ఉమ.

అభిరామ్‌లో అదే చిరునవ్వు...ఆమెని పొదివి పట్టుకున్న అతని చేతుల్లో అదే కస్పర్శ.

అలసిపోయినట్లుగా అతని గుండెల మీద వాలిపోయిన ఆమె కడిగిన ముత్యంలా వుంది.

☆

